క్లుప్తంగా

సెక్షన్ 30 అమలు పొడిగింపు

అమలాపురం టౌన్: స్థానిక పోలీస్ సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలును ఈ నెలాఖరు వరకూ పొడిగించినట్లు డీఎస్పీ ఎం.అంబికా ప్రసాద్ శుక్రవారం ప్రకటించారు. వివిధ కారణాలతో ఇప్పటికే అమలులో ఉన్న ఈ యాక్ట్‌ను పొడిగించడం వల్ల ఎప్పటిలాగే ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులు, ర్యాలీలు తదితరాలు నిర్వహించరాదని ఆయన పేర్కొన్నారు. పోలీస్ సబ్ డివిజనల్ అధికారి నుంచి విధిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తీసుకుంటున్న ఈ చర్యలకు అందరూ సహకరించాలని డీఎస్పీ విజ్ఞప్తి చేశారు.

మౌలిక వసతులకు ప్రాధాన్యం

ఐ.పోలవరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందని జెడ్పీటీసీ సభ్యుడు ముదునూరి సతీష్‌రాజు అన్నారు. శుక్రవారం కేశనకుర్రు పంచాయతీ పరిధి 15వ వార్డులో పుగాకులంకలో 100 మీటర్లు, పల్లెగూడెంలో 240 మీటర్ల సీసీ రోడ్ల నిర్మాణానికి జెడ్పీటీసీతో పాటు ఎంపీపీ మొర్త రాణి మిరియం జ్యోతి, పార్టీ మండల కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజులు భూమిపూజ చేశారు. ఇందుకూరి రంగరాజు, కాశి పరివాజ కుమార్, చెల్లి రమాదేవి, పుగాకు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

'నాతి' దంపతులకు సత్కారం



పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు సత్యనారాయణ దంపతులను సత్కరిస్తున్న నాయకులు

కాట్రేనికోన: పల్లంకుర్రులో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాతి సత్యనారాయణ, సర్పంచ్ అలివేణి దంపతులను శుక్రవారం ఆ పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడిగా నియమించి తనపై మరింత బాధ్యత పెంచారని, పార్టీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తామన్నారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాపే సూర్యప్రకాష్, జీటీ, కాట్రు సత్యనారాయణ, జనిపెల్ల శ్రీను తదితరులు ఉన్నారు.


బాధితుడి చికిత్సకు సాయం



బాధిత కుటుంబానికి నగదు అందజేస్తున్న దరియాలతిప్ప గ్రామస్తులు

యానాం: విశాఖ జిల్లాలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కాకినాడలోని ప్రైవేట్ ఆసుపత్రిలో దరియాలతిప్పకు చెందిన గెద్దం సురేష్ చికిత్స పొందుతున్నారు. అతని చికిత్స నిమిత్తం అదే గ్రామానికి చెందిన అలెక్స్ తదితరుల బృందం సేకరించిన రూ.1.30 లక్షలను శుక్రవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సురేష్ త్వరితగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధిత కుటుంబానికి ఆర్థికంగా సహాయ పడాలనే ఉద్దేశంతో ఈ మొత్తాన్ని అందించినట్లు వారు తెలిపారు.

సర్పంచ్ ప్రమాణ స్వీకారం



సర్పంచ్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న పవిత్ర

అల్లవరం: గోడిలంక పంచాయతీ ఉప ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన రుద్రరాజు పవిత్ర శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో కార్యదర్శి సత్యనారాయణ సమక్షంలో ప్రమాణ స్వీకారం చేశారు. వైస్ ఎంపీపీ వడ్డి గంగ, సొసైటీ అధ్యక్షుడు ఆర్‌వీ నరసింహ రాజు, నాతి శ్రీనివాసరావు, కుంచే నరేంద్ర, అమ్మాజీ, వేగిరాజు సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాం

ముమ్మిడివరం: పరిసరాల శుభ్రత పాటించి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దామని డీఈఓ ఎం.కమలకుమారి పిలుపునిచ్చారు. స్వచ్ఛ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ముమ్మిడివరం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులతో విద్యాలయ ప్రతిజ్ఞ చేయించారు.

కార్యదర్శుల శిక్షణ పరిశీలన

అమలాపురం రూరల్: స్థానిక మండల పరిషత్, ఎంఈఓ కార్యాలయాల్లో జరుగుతున్న పంచాయతీ కార్యదర్శుల శిక్షణను జెడ్పీ సీఈఓ రమణారెడ్డి శుక్రవారం సందర్శించారు. కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. కార్యదర్శులకు ప్రభుత్వం అందించిన ఆరు కరదీపికల గురించి జెడ్పీ సీఈఓ అడిగి తెలుసుకున్నారు. ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, ఏఓ కుమారి పాల్గొన్నారు.

సదా మీ సేవలో..

- ఫ్యామిలీ డాక్టర్‌తో చేరువైన వైద్యం
- ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు
- గ్రామీణుల ఆరోగ్యానికి ప్రాధాన్యం



ఎ.వేమవరప్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారిని పరీక్షిస్తున్న వైద్యాధికారి వాసునాయక్

అమలాపురం రూరల్: ఆరోగ్యమే మహా భాగ్యం అంటుంటారు పెద్దలు.. అలాంటి ప్రజారోగ్యానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. దూరాభారం తగ్గించి ఇంటి ముంగిటకే వైద్య సేవలు తీసుకు వచ్చింది. ప్రభుత్వం తీసుకొచ్చిన ఫ్యామిలీ డాక్టర్ విధానంతో సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. బీపీ, సుగర్, జ్వరం, ఇతర సీజనల్ వ్యాధులకు రక్త పరీక్షలు చేయడమే కాకుండా ఉచితంగా మందులు అందిస్తోంది. 104 వాహనం ద్వారా ప్రతి గ్రామానికి వెళ్లి పీహెచ్‌సీ వైద్యులు సేవలు అందిస్తున్నారు. 14 రకాల పరీక్షలను ఉచితంగా చేసి మందులు ఇస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో పీహెచ్‌సీల్లో సరైన వైద్య సిబ్బంది, మందులు అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడేవారు. ఉదయం ఆసుపత్రికి వెళ్తే డాక్టర్ ఓపీ చూసేంత వరకూ వేచి ఉండాల్సి వచ్చేది. దీంతో ప్రజలకు ప్రైవేట్ ఆసుపత్రులే దిక్కు అయ్యేవి. చిన్న రోగాలకూ రూ.వేలు ఖర్చు చేయాల్సి దుస్థితి ఉండేది. ఈ విధానానికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం స్వస్తి పలికింది. అధికారంలోకి వచ్చిన తొలినాళ్లలోనే పీహెచ్‌సీల్లో సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇచ్చింది.

అమలాపురం రూరల్ మండలంలో 22 గ్రామాలు ఉన్నాయి. ఇందులో పేరూరు, బండారులంక గ్రామాల్లో పీహెచ్‌సీలను ఏర్పాటు చేశారు. ఒక్కో పీహెచ్‌సీలో 11 మంది వరకూ సిబ్బందితో పాటు డాక్టర్లు సేవలు అందిస్తున్నారు. పేరూరులో ముగ్గురు, బండారులంకలో ఇద్దరు చొప్పున వైద్యులు ఉన్నారు. ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా ప్రతి రోజూ ఒక్కో గ్రామానికి చొప్పున వైద్యులు వెళ్లి సచివాలయాల పరిధిలో వైద్య సేవలు అందిస్తున్నారు. ఇలా రెండు పీహెచ్‌సీల పరిధిలో ఈ ఏడాది మే నెల నుంచి ఆగస్టు వరకూ సుమారు 30 వేల మందికి వైద్యం చేశారు. నెలకు రెండు పర్యాయాలు ఒక్కో గ్రామానికి వెళ్తున్నారు.

అందుబాటులోకి హెల్త్ క్లినిక్‌లు

గ్రామంలో ప్రతి రెండు వేల జనాభాకు ఒక వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ఏర్పాటు చేశారు. రోజూ ప్రజలకు అందుబాటులో ఉండేలా సచివాలయాల్లో సీహెచ్‌ఓలుగా ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్)లను నియమించారు. ప్రతి పీహెచ్‌సీలో ఒక డాక్టర్ 104తో వచ్చి ఉదయం 9 నుంచి 12.30 గంటల వరకూ గ్రామాల్లో ఓపీ చూసి ప్రజలకు అవసరమైన మందులను ఉచితంగా ఇస్తున్నారు. మధ్యాహ్నం దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. అంతేకాకుండా అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను, అలాగే బాలింతలు, గర్భిణులను పరిశీలించి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. హెచ్‌బీ, ఆర్‌టీడీ మలేరియా, డెంగీ, ఆర్‌బీఎస్, గర్భ నిర్ధారణ, సీటి పరీక్ష, క్లోరినేషన్, హెచ్‌ఐవీ, హెచ్‌బీఎస్ఏజీ, కంటి పరీక్షలు, వివిధ యూరిన్ తదితర మొత్తం 14 పరీక్షలు చేస్తున్నారు.

ప్రత్యేక ధన్యవాదాలు



నేను కొన్నేళ్లుగా అనారోగ్యంతో మంచానికే పరిమితం అయ్యాను. పక్కన మనిషి తోడు ఉంటేనే గాని ఏ పనీ చేసుకోలేని పరిస్థితి. వైద్యం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలో చాలా ఇబ్బందులు పడేదాన్ని. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక 104 వాహనంలో డాక్టర్లు, ఆశ కార్యకర్తలు ఇంటికి వచ్చి వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రభుత్వ సేవలకు ప్రత్యేక ధన్యవాదాలు.

–ఎ.హేమావతి, నడిపూడి

ఉచితంగా మందులు



ప్రతి నెలా మా గ్రామంలో రెండు సార్లు 104 వాహనం ద్వారా ఫ్యామిలీ డాక్టర్ సేవలు అందిస్తున్నారు. నాకు వైద్య పరీక్షలు చేసి మందులను ఉచితంగా ఇస్తున్నారు. ఈ సేవలు పొందుతూ సంతోషంగా ఉంటున్నాం. వైద్య ఖర్చుల భారం తప్పింది. దూర ప్రాంతాలకూ వెళ్లాల్సిన అవసరమూ లేదు.

–ఎం.సత్యనారాయణ, కామనగరువు

సద్వినియోగం చేసుకోండి



ప్రభుత్వం వైద్య రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. నెలలో ప్రతి గ్రామంలో రెండు దఫాలు వైద్య సేవలు అందించేలా కార్యాచరణ చేపట్టాం. ప్రభుత్వం అందిస్తున్న సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. ప్రజలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలతో అవగాహన కల్పిస్తున్నాం. మొత్తం 70 రకాల మందులను ప్రజలకు అందిస్తున్నాం.

–వాసునాయక్, వైద్యాధికారి, బండారులంక పీహెచ్‌సీ

ప్లాస్టిక్ భూతాన్ని తరిమికొట్టండి



యానాంలో ర్యాలీని ప్రారంభించిన ఆర్ఏఓ మునిస్వామి

యానాం: మానవాళి మనుగడకు హానికరంగా మారిన ప్లాస్టిక్ భూతాన్ని అంతా తరిమికొడదామని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. శుక్రవారం స్థానిక రీజెన్సీ పబ్లిక్ హైస్కూల్ విద్యార్థులు ప్లాస్టిక్ రహిత యానాం అనే నినాదంతో చేపట్టిన ర్యాలీని స్థానిక పరిపాలనాధికారి కార్యాలయం వద్ద ఆయన జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్ఏఓ మాట్లాడుతూ ప్లాస్టిక్‌తో ప్రాణకోటికి పెను ప్రమాదం పొంచి ఉందన్నారు. మనం వాడుతున్న ప్లాస్టిక్ ఉత్పత్తులు ఒకసారి మాత్రమే వాడదగినవన్నారు. అనంతరం విద్యార్థులు ప్లకార్డులు ధరించి ప్లాస్టిక్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హెచ్ఎమ్ టీవీఎస్ఎస్ ప్రసాదరావు, ఇన్‌చార్జి సీహెచ్ వీరభద్రరావు, పీఈటీ దుర్గారావు పాల్గొన్నారు.

'నా..ని ప్రేమకథ' చిత్ర బృందం సందడి



కేక్ కట్ చేసి సందడి చేస్తున్న నా..ని ప్రేమకథ చిత్ర నటులు, కోడైరెక్టర్ సుదర్శన్ తదితరులు

అమలాపురం టౌన్: పీఎస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నిర్మించిన 'నా.. ని ప్రేమకథ' శుక్రవారం విడుదలై అమలాపురంలో వెంకటరామ థియేటర్‌లో ప్రదర్శితమవుతోంది. ఆ థియేటర్ వద్ద ఆ చిత్ర నటీనటులు శుక్రవారం సందడి చేశారు. చిత్ర కోడైరెక్టర్ సుదర్శన్‌ది కోనసీమ కావడంతో పాటు కోనసీమ ఫిల్మ్ క్లబ్‌కు చెందిన నటీనటులు ఎక్కువ మంది ఈ చిత్రంలో నటించడంతో అమలాపురంలో ఆ థియేటర్ వద్ద విజయోత్సవాన్ని జరుపుకొన్నారు. కేక్ కట్ చేసి సందడి చేశారు. నటులు గొలకోటి హరి, రవణం సత్యకుమార్, కల్వకొలను మూర్తి, తడాల మూర్తి, హర్ష కర్రి, నామన దుర్గారావుతో పాటు చిత్రం కో డైరెక్టర్ సుదర్శన్, కోనసీమ ఫిల్మ్ క్లబ్ అధ్యక్షుడు గనిశెట్టి రమణలాల్, కుసుమ సూర్యమోహనరావు తదితరులు పాల్గొన్నారు. విజయోత్సవం తర్వాత నటులు థియేటర్‌లో ప్రేక్షకులతో మమేకమై ఈ చిత్రాన్ని వీక్షించారు.

వరి పొలాల పరిశీలన

కాట్రేనికోన: వరిలో చీడపీడలను గుర్తించేందుకు ఏరువాక శాస్త్రవేత్తలు బి.భవాని, పీబీ ప్రదీప్‌కుమార్, ఏఓ ప్రవీణ్‌కుమార్‌లు పల్లంకుర్రు, బొజ్జావారిపేటలలోని వరి క్షేత్రాలను పరిశీలించారు. ఎంటీయూ–1318, ఎంసీఎం–1232, మినికిట్స్ ఎంసీఎం–125 రకాలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. స్వర్ణ రకంలో ఫిస్టియా కలుపు మొక్కలు, ఎలుకలు, ఆకుముడత ఉన్నట్లు గుర్తించారు. ఆకు ముడత నివారణకు మోనోక్రోటోఫాస్ మందు పిచికారీ చేయాలన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి రూ.కోటి నిధులు

మంత్రి పినిపే విశ్వరూప్



రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న మంత్రి విశ్వరూప్

అల్లవరం: ఎస్.రామేశ్వరంలో కొలువైన ఉమా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని రూ.కోటి నిధులతో పునర్నిర్మిస్తామని రాష్ట్ర రవాణా శాఖా మంత్రి పినిపే విశ్వరూప్ తెలిపారు. సర్పంచ్ కొల్లు వెంకటరమణ అధ్యక్షతన ఆలయ నూతన పాలక మండలి ప్రమాణ స్వీకారోత్సవం శుక్రవారం జరిగింది. దీనికి ముఖ్య అతిథులుగా మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ అంగడి రామారావుతో పాటు మరో ఏడుగురు సభ్యులతో మంత్రి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశిష్టత కలిగిన ఉమా సమేత రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని టూరిజం పరిధిలోకి తీసుకువచ్చి అభివృద్ధి చేస్తామన్నారు. పునర్నిర్మాణానికి కేటాయించిన రూ.కోటిలో రూ.పది లక్షలతో భక్తులకు సౌకర్యాలు కల్పిస్తామన్నారు. టూరిజం శాఖ మంత్రి రోజాను ఆలయానికి తీసుకొచ్చి అభివృద్ధికి నిధులు కేటాయింపులు చేసేలా కృషి చేస్తామన్నారు. రామేశ్వరం మొగని శాశ్వతంగా నిర్మించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ మాట్లాడుతూ ఎంతో ప్రసిద్ధి చెందిన పురాతన ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎంపీపీ శేషగిరిరావు, జెడ్పీటీసీ కొడుకు గౌతమి, అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ కర్రి వెంకట రామరాజు, వైస్ ఎంపీపీ వడ్డీ గంగ, సర్పంచులు సుందరనీడి సాయి, రాకాపు విజయలక్ష్మి, తిక్కిరెడ్డి శ్రీనివాసరావు, బర్రె సీతారత్నం, ఎంపీటీసీ సభ్యులు కర్రి సత్య, పులుసుగంటి రాజేశ్వరి, అమలాపురం మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నాని రాజు, సొసైటీ చైర్మన్ అల్లూరి సురేష్ రాజు తదితరులు పాల్గొన్నారు.

సిరుల తల్లీ.. సదా స్మరామి



అమలాపురం సుబ్బాలమ్మ ఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరిస్తున్న మహిళలు



గాంధీనగర్‌లో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు చేస్తున్న భక్తులు

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



కొమరగిరి కనకదుర్గమ్మ ఆలయంలో భక్తుల పూజలు

అమలాపురం టౌన్: శంఖచక్ర గదాహస్తే మహాలక్ష్మీ నమోస్తుతే.. వరాల తల్లీ, సర్వపాపహరిణి పాహిమాం అంటూ ఆ వరలక్ష్మీ దేవిని భక్తులు కొలిచారు. శ్రావణ మాసం మూడో శుక్రవారాన్ని పురస్కరించుకుని పూజలతో ప్రతి ఇంటా పండగ శోభ వచ్చింది. అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఉదయం నుంచి వైభవంగా జరిగాయి. ఆలయ చైర్మన్ బిళ్ల మల్లికార్జునరావు, ఈఓ బొక్కా వీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి, మీనాక్షి ఫౌండేషన్ అధ్యక్షురాలు బేబీ మీనాక్షి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తొలుత సుబ్బాలయ్మ అమ్మవారిని ఆమె దర్శించుకుని ప్రత్యేక పూజలు ఆచరించారు. వ్రతాలు ఆచరించిన మహిళలకు ఆలయం తరపున పూజా సామగ్రి, రూపులు ఉచితంగా సమకూర్చారు. ఆలయ అర్చకుడు సత్యనారాయణమూర్తి (సతీష్) పర్యవేక్షణలో వ్రతాలు శాస్త్రోక్తంగా జరిగాయి. ఆలయ ధర్మకర్తలు చప్పిడి సతీష్‌కుమార్, అరిగెల చంద్రశేఖర్, పందిరి సత్య సుధాకర్, సింగంశెట్టి చంద్రకళ దుర్గాలక్ష్మి, అయితాబత్తుల లక్ష్మి, అమలదాసు వెంకటలక్ష్మి, గిత్తా శ్రీనివాస్ వ్రతాలకు హాజరైన మహిళలకు పూజాపరంగా సేవలు అందించారు.

- స్థానిక గాంధీనగర్ కనకదుర్గాదేవి ఆలయ ప్రాంగణంలో విశ్వ హిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఆధ్వర్యంలో ఆలయ కమిటీ పర్యవేక్షణలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు జరిగాయి. వీహెచ్‌పీ జిల్లా ధర్మ ప్రచార విభాగం ప్రముఖ్ రేలంగి కుమార్ శంకర్‌గౌడ్ ఈ వ్రతాల క్రతువుకు అతిథిగా హాజరయ్యారు. వీహెచ్‌పీ సభ్యులు బి.కృష్ణమూర్తి, గోపాలకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధి ఆదినారాయణ పాల్గొన్నారు.

ఐ.పోలవరం: కొమరగిరి కనకదుర్గమ్మ ఆలయం, జి.మూలపొలం, కేశనకుర్రు కామేశ్వరి అమ్మవారు, ఎదుర్లంక, తిళ్లకుప్ప తదితర గ్రామాల్లోని అమ్మవారి ఆలయాల్లో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు.


అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



కామనగరువులో ప్రభుత్వ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

అమలాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని మంత్రి పినిపే విశ్వరూప్ తనయుడు డాక్టర్ పినిపే శ్రీకాంత్ అన్నారు. కామనగరువు మెట్ల సత్యనారాయణ కాలనీలో శుక్రవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు ఆయన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇళ్ల నిర్మాణ రుణాలు, స్థలాలు తదితర వాటి గురించి శ్రీకాంత్‌కు పలువురు తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో రూ.కోట్లతో రోడ్లు, డ్రైన్లను అభివృద్ధి చేసిందన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దంగేటి డోలామణి, ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బొంతు గోవిందశెట్టి, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని నాని, సర్పంచ్ నక్కా అరుణకుమారి, గ్రామ కమిటీ అధ్యక్షుడు రాజులపూడి మరళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

• జయహో భారత్..



కాట్రేనికోన: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం ఇస్రో సూర్యునిపై ప్రయోగించనున్న ఆదిత్య ఎల్–1 విజయవంతం కావాలని కోరుకుంటూ చంద్రయాన్–3 స్వాగతం పలుకుతున్నట్లు ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి గీచిన చిత్రం అందరినీ ఆకట్టుకుంది. కలియుగ దైవం వేంకటేశ్వరస్వామి దయతో ఆదిత్య ఎల్–1 విజయవంతమై భారత దేశ కీర్తి ప్రతిష్ఠలు మరింత పెరగాలని అంజి ఆకాంక్షించారు.

సంక్షిప్తంగా..

ఆసుపత్రికి వెళ్లి.. పింఛను ఇచ్చి



అమలాపురం ఆసుపత్రిలో సూర్యప్రకాష్‌కు పింఛను అందజేస్తున్న వలంటీర్ కుమార్‌కృష్ణ

ఐ.పోలవరం: రోడ్డు ప్రమాదంలో గాయపడిన కొమరగిరికి చెందిన మంగా సూర్యప్రకాష్ అమలాపురం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి వికలాంగ పింఛన్ సొమ్మును వలంటీర్ ఆకుమర్తి కుమార్‌కృష్ణ అందజేశారు.

ఉప్పలగుప్తం: కొత్త పింఛన్లను ఆయా గ్రామాల సర్పంచులు శుక్రవారం లబ్ధిదారులకు అందజేశారు. ఉప్పలగుప్తంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజు 15 మందికి, గొల్లవిల్లిలో సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ ఏడుగురికి పింఛన్లు అందజేశారు. ఏఎంసీ డైరెక్టర్ చప్పిడి దుర్గారావు, నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహం అడ్డగింత

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడులో పదో తరగతి విద్యార్థినికి ఆమె కుటుంబ సభ్యులు బాల్య వివాహం చేసేందుకు ప్రయత్నించడంతో ఐసీడీఎస్ అధికారులు, ప్రజాప్రతినిధులు అడ్డుకున్నారు. సీడీపీవో కేవీఎల్‌డీ కుమారి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, సర్పంచ్ రేలంగి దుర్గారావు, ఎంపీటీసీ రేవు శ్రీను బాబులు ఆ కుటుంబానికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

పోస్టుల భర్తీకి మార్గదర్శకాలు

యానాం: విద్యాశాఖ పరిధిలో త్వరలో టీచర్ పోస్టుల భర్తీకి శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. నాన్ టీచింగ్ పోస్టులైన బాలభవన్ ఇన్‌స్ట్రక్టర్, ఫైన్‌ఆర్ట్ టీచర్ తదితర పోస్టులకు సైతం మార్గదర్శకాలు ఇచ్చారు.

మట్టి సేకరణ

ముమ్మిడివరం: మన మట్టి– మన దేశం కార్యక్రమంలో భాగంగా సీహెచ్ గున్నేపల్లిలో బీజేపీ నాయకులు ఇంటింటికీ తిరిగి మట్టి సేకరణ చేపట్టారు. ఈ మట్టి దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని సేకరిస్తున్నట్లు వారు తెలిపారు. నాయకులు గొలకోటి వెంకటరెడ్డి, కొయ్య దుర్గారావు, కోనే రామ్మూర్తి, నాగ రాజారావు, బాబీ మాస్టారు, వేటుకూరి సూర్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలని వినతి

యానాం: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 16 ఏళ్లుగా రోజువారీ వేతన చెల్లింపు విధానం ద్వారా అంబులెన్స్ డ్రైవర్లుగా సేవలు అందిస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని పలువురు డ్రైవర్లు శుక్రవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావుకు వినతి పత్రం అందజేశారు.

చిత్తశుద్ధితో పనిచేయాలి

అల్లవరం: ఉద్యోగులు చిత్తశుద్ధితో పని చేయాలని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాయలంలో శుక్రవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. పీఆర్ ఏఈ సంపత్, హౌసింగ్ ఏఈ సుబ్బారావు, ఈవోపీఆర్డీ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

5న వినియోగదారుల పరిష్కార వేదిక

యానాం: స్థానికంగా విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక సమావేశాన్ని 5న నిర్వహిస్తామని ఏఈ లంక కృష్ణారావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ ఏఈ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ ఈ సమావేశం ఉంటుందన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం

ఉప్పలగుప్తం: విలసవిల్లిలో 16 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ప్రారంభించారు. గ్రామంలో లోఓల్టేజీ సమస్యను పరిష్కరించేందుకు అధికారులు ఈ చర్యలు చేపట్టారన్నారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, కోలా ఏసు, పుత్సల ఏసు పాల్గొన్నారు.

బిల్లులు తప్పనిసరిగా తీసుకోవాలి

యానాం: ప్రతి కొనుగోలుపై వినియోగదారులు జీఎస్టీ బిల్లు తప్పనిసరిగా తీసుకోవాలని ఆర్ఏఓ మునిస్వామి అన్నారు. స్థానిక ఓ వస్త్ర దుకాణంలో ఇన్‌వాయిస్ ప్రోత్సాహక పథకాన్ని ఆయన ప్రారంభించారు. వర్తక సంఘ గౌరవాధ్యక్షుడు మాజేటి సత్యభాస్కర్, అధ్యక్షుడు వెంకన్న పాల్గొన్నారు. అన్ని కొనుగోళ్లకు ఇన్ వాయిస్‌లు, బిల్లులు అడిగే కస్టమర్ల సంస్కృతిని ప్రోత్సహించేందుకు భారత ప్రభుత్వం ఇన్‌వాయిస్ ప్రోత్సాహ పథకాన్ని ప్రవేశపెట్టిందని యానాం సీజీఎస్టీ రేంజ్ ఇన్‌స్పెక్టర్ కె శివ కిషోర్ తెలిపారు. రూ.200పైగా కొనుగోళ్లపై చేసిన జీఎస్టీ బిల్లును తీసుకుని నాబిల్లు–నాహక్కు పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా ప్రతి నెలా రూ.పది వేల నుంచి రూ.కోటి వరకూ లాటరీ ద్వారా నగదు బహుమతిని గెలుచుకునే అవకాశం ఉంది.

సమస్యలు పరిష్కరించండి

తాళ్లరేవు: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరుతూ సీపీఎం నాయకులు కరపత్రాలను పంపిణీ చేశారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ తాళ్లరేవు సచివాలయం–1, పటవల సచివాలయం–2 పరిధిలో పర్యటించారు. జిల్లా నాయకుడు కేఎస్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సేవలు చిరస్మరణీయం

యానాం: మాజీ ఎమ్మెల్యే దివంగత రక్షా హరికృష్ణ సేవలు చిరస్మరణీయమని పలువురు అన్నారు. హరికృష్ణ జయంతిని పురస్కరించుకుని రాజీవ్ రివర్ బీచ్ రహదారిలో ఆయన విగ్రహానికి ఆర్ఏఓ మునిస్వామి పూలమాలలు వేశారు. కమిషనర్ అరుల్ ప్రకాష్, సీఐ షణ్ముగం పాల్గొన్నారు.